క్లుప్తంగా

వరద బాధితులకు సహాయం

చింతలపూడి: విజయవాడ వరద బాధితులకు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్, అజీమ్ చారిటీ తరఫున సాయం అందించారు. రూ.10 వేల ఆర్థిక సాయాన్ని యూనియన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్కే అజాద్ గురువారం చింతలపూడిలో జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ రవీంద్రల చేతుల మీదుగా చింతలపూడి జామియా మసీదు కమిటీ, జమాత్ ఇస్లాం హింద్ బాధ్యులకి అందించారు. ఎస్సై కుటుంబరావు, పాత్రికేయులు, జామియా మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ హెల్పింగ్ ఫౌండేషన్ సహాయం

టి.నరసాపురం: విజయవాడ వరద బాధితులకు ఏపిగుంటకు చెందిన ఫ్రెండ్స్ హెల్పింగ్ ఫౌండేషన్ సహాయం అందించింది. గురువారం మినీ వ్యాన్‌లో ఆహార పదార్థాలు తీసుకువెళ్లి విజయవాడ సింగ్ గర్, వాంబే కాలనీ వాసులకు అందజేశారు. గుల్లపూడి పోలు సుధాకర్ నేతృత్వంలో సభ్యులు నాలుగువేల వాటర్ ప్యాకెట్లు, 2 వేల బిస్కెట్లు, 1200 వెజిటబుల్ బిర్యాని, 500 బ్రెడ్ ప్యాకెట్లు, 500 పెరుగు ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుల దాతృత్వం

కొయ్యలగూడెం: ఉపాధ్యాయ దినోత్సవం వేళ తమ పూర్వపు మిత్ర బృందంతో కలిసి దాతృత్వాన్ని చాటుకున్నారు పొంగుటూరు ప్రభుత్వ హైస్కూల్‌కి చెందిన ఉపాధ్యాయులు. జెడ్పీ హైస్కూల్‌లో ఓ విద్యార్థి తండ్రి మర్రి శామ్యూల్ అనే వ్యక్తికి ప్యాంక్రియాసిస్ (క్లోమం) బాగా దెబ్బతిని జీర్ణవ్యవస్థ పాడైపోయి ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. అదేవిధంగా మరో విద్యార్థి తల్లి పి.ప్రసన్నకు పెద్ద ప్రేగుకి గాయం ఏర్పడి ఆపరేషన్ నిర్వహించాల్సి ఉంది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎంపీపీ స్కూల్ పాఠశాల హెడ్ మాస్టర్ సంకు కొండలరావు ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.10 వేలు అందజేశారు.

వీల్‌చైర్ బహూకరణ

ద్వారకాతిరుమల: సత్తెన్నగూడెం గ్రామానికి చెందిన దివ్యాంగ బాలుడు తానిగడప జస్వంత్‌కు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం వీల్‌చైర్‌ను అందించింది. మానవత సంస్థ సభ్యుడు చింతమనేని హనుమంతరావు, మాజీ ఎంపీపీ వడ్లపూడి ఈశ్వర భాను వరప్రసాద్ జ్ఞాపకార్థం, మానవత సంస్థ మండల అధ్యక్షుడు దేవరపల్లి రాయుడు బాబు చేతుల మీదుగా జస్వంత్‌కు వీల్‌చైర్ అందజేశారు.

కుక్కునూరులో ర్యాలీ

కుక్కునూరు: ఏటా వచ్చే గోదావరి వరదలకు నిర్వాసిత ప్రజలు నిద్ర, సరైన తిండి లేక అల్లాడుతున్నారని, వారిని ఈ కష్టాలనుంచి గట్టెక్కించి వారికి ప్యాకేజీ చెల్లించాలని సీపీఐ ఎంఎల్ ప్రజా పందా మాస్ లైన్ జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్కే గౌస్ కోరారు. నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని కోరుతూ గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో జీసీసీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కుక్కునూరు ప్రధాన సెంటర్లో మానవహారం నిర్వహించి వినతిపత్రాన్ని తహసిల్దార్ కార్యాలయంలో సమర్పించారు.

పీహెచ్‌సీకి ఫ్రిజ్ బహూకరణ

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గ్రామానికి చెందిన సోషల్ వర్కర్ నాటకశాల వెంకటరాజు రూ.25 వేల విలువైన డబల్ డోర్ ఫ్రిజ్ గురువారం బహూకరించారు. హాస్పిటల్ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.5 లక్షల విలువైన సామాగ్రిని రోగుల వైద్య ఆరోగ్య చికిత్సలకు వెంకటరాజు అందజేశారని ఎంపీహెచ్ఈఓ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ సందర్భంగా బహుకరించబడిన ఫ్రిజ్‌ను రోగుల సౌకర్యార్థం వినియోగిస్తామని తెలిపారు.

ఉత్తమ గురువులకు సత్కారం



ఏలూరు జెడ్పీ కార్యాలయంలో గురుపూజోత్సవం సందర్భంగా ఓ ఉపాధ్యాయుడికి పీఎఫ్ బ్యాలెన్స్ షీట్‌ను అందజేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏలూరు జెడ్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను అధికారులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. - ఏలూరు (ఆర్ఆర్‌పేట)



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరిస్తున్న ప్రధానోపాధ్యాయులు కె.సోమసుందర్, ఎస్కే నాగూర్‌మీరా సాహెబ్, గుజ్జు నాగసుధ, గొల్లపల్లి రామారావు, టి.ప్రభాకరరావు, బండి వెంకటేశ్వరరావు, సీహెచ్ జయరాజు, ఎన్.వెంకటరత్నం, టి.వరలక్ష్మి, జీసీఎస్‌వీఎస్ కృష్ణారావు



కె.వెంకటేశ్వరరావు, పి.వెంకటరమణ, సీహెచ్ సాల్మన్‌రాజు, రాయపూడి వెంకటరమణ, వి.రామోజీరావు, కె.పరమానందం, పి.బేబిసారమ్మ, సీహెచ్ పిచ్చోడు, వహీదా బేగం, కె.మంజుల



అత్యధిక విద్యార్థులను చేర్చుకున్న పాఠశాలల హెచ్‌ఎంలు కేపీడీటీ హైస్కూల్ హెచ్‌ఎం, ఏలూరు, గరల్స్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం, కామవరపుకోట, గరల్స్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం, ఆగిరిపల్లి

నూరుశాతం హాజరు: టి.మురళీమోహన రావు, గంగన్నగూడెం

సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ: ఎం.రామకృష్ణ, కోరుకొల్లు హైస్కూల్



టెన్త్‌లో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించిన పాఠశాలల హెచ్‌ఎంలు ఏపీఆర్‌జీహెచ్‌ఎస్ ప్రిన్సిపాల్, నాగిరెడ్డిగూడెం.. ఏపీరెసిడెన్సీ గరల్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్, ముసునూరు.. ఏపీఆర్ బాయ్స్‌స్కూల్ ప్రిన్సిపాల్, అప్పలరాజుగూడెం.. కేజీబీవీ ప్రిన్సిపాల్, వేలేరుపాడు.. జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు, వీరమ్మకుంట.. జీటీడబ్ల్యూ హెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు, లంకలపల్లి

సమాజంలో గురువుల పాత్ర కీలకం

- ఘనంగా గురుపూజోత్సవం
- ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ద్వారకాతిరుమల: సమాజంలో గురువుల పాత్ర ఎంతో కీలకమైందని మండలంలోని గుణ్ణంపల్లి జెడ్పీ ఓరియంటల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరప్రకాశం అన్నారు. స్థానిక పాఠశాలలో గురువారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా హిందీ ఉపాధ్యాయురాలు లీలాకుమారిని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం భారతీదేవి, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఎన్.శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అలాగే ద్వారకాతిరుమలలోని శ్రీశ్రీనివాస కళాశాలలో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను సత్కరించారు.

సర్వేపల్లికి నివాళి

చింతలపూడి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు పెరుమాళ్ళపల్లి సంజీవ్ కుమార్, దారముక్కల రామకృష్ణలను ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు చిల్లపల్లి విజయలక్ష్మి మాట్లాడుతూ డా సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను కొనియాడారు. జిల్లా జీఎస్టీ కోఆర్డినేటర్ సీహెచ్ రామ్మోహన్‌రావు, కార్యదర్శి చింతనిప్పుల మాధవి, జోన్ చైర్ పర్సన్ వల్లీ కృష్ణవేణి, సభ్యులు పాల్గొన్నారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద, మండల ఎస్టీయూ ఆధ్వర్యంలో డా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

టి.నరసాపురం: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని గురువారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎంఈవో టి.రామ్మూర్తి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులు జీసీఎస్‌వీ కృష్ణారావు, ఎన్.పుష్పావతి, వి.శిఖామణి, ఏపీఆర్ఎస్ అప్పలరాజుగూడెం ప్రిన్సిపాల్ డీఎస్‌బీ శంకరరావును ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంఈవోలు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణిని ఉపాధ్యాయులు సన్మానించారు. మక్కినవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984–85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలలోని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.కుమారి, వినుకొండ కుమార్‌రాజు, కట్టిరెడ్డి వెంకటేశ్వరరావు, జగ్గయ్య, విశ్వేశ్వరరావు, వెంకన్నబాబు, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

సర్వేపల్లి సేవలు ఎనలేనివి

కామవరపుకోట: రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడి భీమరాజు అధ్యక్షతన, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుంచి తొలి ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా సర్వేపల్లి ఉన్నత శిఖరాలకు చేరుకొని దేశానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. అధ్యాపకులు ఉషారాణి, కె ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, పి ఏడుకొండలు, విజయ్ కృష్ణ, ఉమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం: రేపల్లె వాడలో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో...

బుట్టాయిగూడెం రోడ్డులోని పద్మ థియేటర్ వెనుక ఎంపీపీ స్కూల్‌లో ఉప్పలమెట్ట వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించి, పాఠశాలకు ఐరన్ బీరువాను అందజేశారు. ఒక మామిడి చెట్టు, ఒక గులాబీ మొక్క నాటారు. పట్టణానికి చెందిన భాగ్యలక్ష్మికి అనే నిరుపేద మహిళలకు స్నేహజ్యోతి సంస్థ గ్రైండర్‌ను అందజేసింది.

ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

కొయ్యలగూడెం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో ప్రకాశం డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను బహుకరించారు. ఎం.సుజాత, ఎం.సరితకుమారి, ఎస్‌వీ రమణ (రిటైర్డ్), జి.వరలక్ష్మి, వీవీఎస్ఎన్ స్వామిలను ఘనంగా సన్మానించారు. మానవత అధ్యక్షుడు మాటూరు సుధీర్, మెటమర్రి ఉమామహేశ్వరరావు, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కొయ్యలగూడెంలోని మూడవ వార్డు ఎంపీపీ స్కూల్లో ఎస్ఎంసీ చైర్మన్ పూలపల్లి పద్మ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాయపూడి వెంకటరమణను ఫుడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొబ్బర చినరాజు ఆధ్వర్యంలో సత్కరించి అభినందనలు తెలిపారు.



జంగారెడ్డిగూడెం: ఉప్పలమెట్ట వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయురాలికి సన్మానం

విద్యార్థి గురించి ఆలోచించే తొలి వ్యక్తి గురువు

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీచర్స్ డే నిు కళాశాల కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రసాద్‌బాబు సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని పూలమాలలతో సత్కరించారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత ఏ సంబంధం లేకపోయినా విద్యార్థి గురించి ఆలోచించే మొదటి వ్యక్తి ఉపాధ్యాయుడు అని, ఉపాధ్యాయుడు చెప్పింది విని విద్యార్థులు తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు.



కామవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



ద్వారకాతిరుమల: గుణ్ణంపల్లిలో ఉపాధ్యాయురాలు లీలాకుమారిని సత్కరిస్తున్న దృశ్యం



టి.నరసాపురం: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

పునరావాస కేంద్రాలకు 100 కుటుంబాలు



గొమ్ముగూడెం గ్రామస్తులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న దృశ్యం

కుక్కునూరు: గోదావరి వరదల నేపథ్యంలో గొమ్ముగూడెం గ్రామంలోని 100 కుటుంబాలకు చెందిన 300 మందిని దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించినట్లు జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య తెలిపారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని గమనిస్తూ తగిన విధంగా సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే లచ్చిగూడెం గ్రామస్తులకు రాకపోకలు లేనందున అక్కడ 120 కుటుంబాల వారికి నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నామన్నారు. భద్రాచలంలో గురువారం సాయంత్రం 5 గంటలకు 45.50 అడుగులు వరద నీటిమట్టం నమోదైనందున రెండవ ప్రమాద హెచ్చరికకు చేరితే అందుకు అవసరమైన ముందస్తు కార్యాచరణ కూడా సిద్ధం చేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామానికి సూపర్‌వైజర్ ఆఫీసర్లగా మండల లెవెల్ అధికారులను నియమించామన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలలకు తరలించుటకు 10 మోటర్ బోట్లు, 35 ట్రాక్టర్లు సిద్ధం చేశామన్నారు. కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో 83097 03949 నంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలో పునరావాస కేంద్రం ఏర్పాట్లను ఏపీఐజీసీ జోనల్ మేనేజరు కె.బాబ్జి పర్యవేక్షిస్తున్నారు.

మునిగిన పంటచేలు



కుక్కునూరు వద్ద మునిగిన పంటచేలు

కుక్కునూరు: భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి మొదటి ప్రమాద హెచ్చరికను దాటి 45 అడుగులకు చేరడంతో మండలంలో గురువారం వరద ఉధృతి పెరిగింది. పెరిగిన వరదతో మండలంలో పంటచేలు నీట మునిగాయి. కుక్కునూరులో సాగుచేసిన జామాయిల్ తోటలను గోదావరి ముంచెత్తడంతో పెట్టుబడి కోల్పోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ముంపు బాధితులకు నిత్యావసరాల పంపిణీ

గోదావరి వరద ఉధృతికి ముంపునకు గురైన లచ్చిగూడెం గ్రామ నిర్వాసితులకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ పంచదార, నూనె ప్యాకెట్లు, ఉల్లిగడ్డలు, బంగాళాదుంపలను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ చలపతిరావు పేర్కొన్నారు

ఎంఆర్‌పీ ధరలకే ఎరువులను విక్రయించాలి



చింతలపూడిలో శ్రీ వెంకటేశ్వర మెన్యూర్స్ డిపోను తనిఖీ చేస్తున్న దృశ్యం

చింతలపూడి: దుకాణాదారులు రైతులకు ఎరువులను ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా హెచ్చరించారు. చింతలపూడి మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులో రికార్డులను, స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. రైతులు అడిగిన ఎరువుల కంటే అదనంగా అవసరం లేని ఉత్పత్తులను విక్రయించకూడదని చెప్పారు. ఎరువులు ఉన్న చోట ఇతర వ్యవసాయ పదర్థాలను నిల్వ ఉంచకూడదని ఆదేశించారు. ఆయన వెంట చింతలపూడి అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగకుమార్, ఏవో మీనా కుమారి పాల్గొన్నారు.

ధర్మాజీగూడెంలో తనిఖీ

లింగపాలెం: ధర్మాజీగూడెంలో ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ బాషా తనిఖీచేశారు. హోల్‌సేల్, రిటైల్ షాపులలో రికార్డులను పరిశీలించారు. ఎంఆర్‌పీకి మించి విక్రయించరాదని, రైతులు అడిగిన ఎరువులు మాత్రమే ఇవ్వాలని సూచించారు.

నిండుకుండలా చెరువులు



చెరువులను పరిశీలిస్తున్న అధికారులు

పోలవరం రూరల్: ఇటీవల కురిసన భారీ వర్షాలతో సాగునీటి చెరువులు నిండుకుండలా మారాయి. ఇంకా వర్షాలు కురిస్తే చెరువు గట్లు గండ్లు పడే ప్రమాదం ఉందని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోవిందరాజుల చెరువు, తానా కుంట చెరువు, కొత్తూరు చెరువులను మైనర్ ఇరిగేషన్ డీఈ రామ్‌ప్రసాద్ మండల ప్రత్యేక అధికారి దేవకీదేవి గురువారం పరిశీలించారు.

భయాందోళనలో రైతులు

గోదావరి వరద పెరుగుతుండటంతో కడెమ్మ స్లూయిజ్ ద్వారా వరదనీరు ఎగపోటు తన్ని పోలవరంలో నాట్లు వేసిన పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. కొండవాగుల నీరు కూడా చేరడంతో ముంపు మరింత పెరుగుతోంది. వరద పూర్తిగా తగ్గితే తప్ప ఈ నీరంతా గోదావరి నదిలోకి చేరే అవకాశం లేదు. మరో అల్పపీడనం హెచ్చరికలు రావడంతో రైతుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. మళ్లీ వర్షాలు కురిస్తే ముంపునకు గురయ్యే పొలాలు తేరుకునే అవకాశం ఉండదని, నాట్లు కుళ్లిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గని గోదావరి వరద

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గురువారం ఉదయం 44.6 అడుగులు ఉన్న నీటిమట్టం రాత్రి 8 గంటలకు 45.6 అడుగులకు చేరింది. వర్షాల వల్ల గోదావరి వరదకు తోడు పెద్దవాగు, తాలిపేరు, శబరి నీరు ఎగపోటు వల్ల వేలేరుపాడు మండలంలో 29 గ్రామాలు నాలుగో రోజు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే రహదారిలో మేళ్ళవాగు, ఎద్దెలవాగు, టేకూరు, తదితర వాగుల వంతెనలు ముంపులోనే ఉన్నాయి. దిగువనున్న కొయిదా, కాచారం, పేరంటపల్లి, టేకుపల్లి, తాళ్ళగొంది, పూసుగొంది, టేకూరు, కట్కూరు, సిద్దారం, ఎడవల్లి, చిట్టంరెడ్డిపాలెం, ఎర్రతోగు, చిగురుమామిడి, బోళ్ళపల్లి, పాతనార్లవరం, తూర్పుమెట్ట, కొత్తూరు, తదితర గ్రామాలతోపాటు మరో 12 గ్రామాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. ఆయా గ్రామాల గిరిజనులు గత నాలుగు రోజులుగా అంధకారంలో మగ్గుతూ నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి పనులు లేక ఇండ్లలోనే ఉంటున్నారు. వేలేరుపాడు నుంచి రుద్రమకోట వెళ్లే రహదారి, కొయిదా వెళ్లే రహదారి నీటిలోనే ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. వేలేరుపాడు నుంచి రేపాకగొమ్ము గ్రామానికి వెళ్లే రహదారి నీటమునగడంతో ఆ గ్రామస్తులు కాలినడకన గోదావరి దాటుతున్నారు.

వరద నీటిలో వ్యాన్‌పై వెళ్లిన అధికారులు

గోదావరి వరద క్రమేపీ పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు. గురువారం రేపాకగొమ్ము గ్రామాన్ని డ్వామా పీడీ ఎ.రాము, తహసీల్దార్లు చల్లన్నదొర, సత్యనారాయణ సందర్శించారు. రేపాకగొమ్ము రహదారి నీటమునగడంతో వ్యాన్‌పై వెళ్లారు. గ్రామాన్ని ఖాళీ చేయాలని అధికారులు కోరగా, ఆ గ్రామస్తులు తమకు వరద భయమేమీ లేదని, భద్రాచలం వద్ద మూడో ప్రమాదహెచ్చరిక జారీ అయ్యాక ఖాళీ చేస్తామని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. అదేవిధంగా తిర్లాపురం, తాట్కూరుగొమ్ము, కన్నాయిగుట్ట, గ్రామాల్లో అధికారులు పర్యటించారు.

సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సంసిద్ధం

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరిక జారీచేసే పరిస్థితుల్లో వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము, తిర్లాపురం, నార్లవరం తదితర గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సన్నద్ధంగా ఉన్నామని డ్వామా పీడీ ఎ.రాము చెప్పారు. గురువారం వేలేరుపాడు మండలంలోని తాట్కూరుగొమ్ము బోట్ పాయింట్ వద్ద గోదావరి వరద పరిస్థితిని జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య, స్థానిక అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. వరద ప్రభావిత గ్రామాల్లో నియమించిన స్పెషల్ ఆఫీసర్లు ఆయా గ్రామాల్లో ఉన్నారని, ఏ క్షణాన గోదావరి పెరిగినా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారని పేర్కొన్నారు.



రేపాకగొమ్ము రహదారి నీటమునగడంతో వ్యాన్‌పై వెళ్తున్న అధికారులు